గణనాథుల విగ్రహాలు సిద్ధం

- వినాయక చవితికి మొదలైన సందడి
- పీఓపీతో పర్యావరణానికి, జలచరాలకు ముప్పు



కొత్తపేటలో మట్టి గణపతి విగ్రహాలు తయారీలో నిమగ్నమైన తయారీదారుడు

కొత్తపేట: వినాయకచవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో దాదాపు వీధివీధినా గణపతి నవరాత్రుల పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో తయారీదారులు వినాయక విగ్రహాలు తయారుచేస్తున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో విగ్రహ తయారీ కంపెనీలతో పాటు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసి విక్రయిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో గణపతి, దేవీ నవరాత్రుల సందర్భంగా ఆయా దేవతా మూర్తుల విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని సుమారు రెండు నెలల నుంచే విగ్రహాలు తయారీలో నిమగ్నమయ్యారు. 2 అడుగుల నుంచి 15 అడుగుల వరకూ భారీ విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో పాటు కొందరు భక్తుల కోరిక మేరకు మట్టితో గణపతి విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా కొంతమంది తయారీదారులు ప్రత్యేకంగా మట్టి విగ్రహాలు ఎక్కువగా తయారుచేస్తున్నారు. పీఓపీ విగ్రహాలు విశాఖపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకూ సుమారు 5 వేలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు.

పీఓపీతో పొంచి ఉన్న ప్రమాదం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారు చేసే విగ్రహాల ద్వారా పర్యావరణానికి తీరని ముప్పు అని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. విగ్రహాల అలంకరణకు ఉపయోగించే రసాయన రంగులు మరింత ప్రమాదకరం. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆ విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత నీటిని కలుషితం చేయడమే కాకుండా అనేక రకాల రోగాలకు మూలం అవుతున్నాయి. నీటిలో ఉండే జలచరాలు నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందంటున్నారు. పీఓపీ విగ్రహాల తయారీలో వినియోగించే జిప్సం, గంధకం, మెగ్నీషియం, సీసం లాంటి రసాయనాలు అత్యంత ప్రమాదకరమని అంటున్నారు. ఈ మూలకాలు సాధారణంగా నీటిలో త్వరగా కరగవని, వీటి ప్రభావం మనుషులపైనే కాకుండా వృక్షాలపై, జంతువులపై కూడా ప్రభావం చూపుతాయన్నారు.

పర్యావరణానికి మేలు చేసే విగ్రహాలనే పూజించాలి



పీఓపీ, కెమికల్స్‌తో తయారుచేసే విగ్రహాలను ప్రతిష్ఠించడం వలన పర్యావరణాన్ని కలుషితం చేసినట్లవుతుంది. పర్యావరణానికి ఎటువంటి అవరోధం కలగకుండా, అనుకూలమైన విధానంలో ఎకో ఫ్రెండ్లీ ప్రతిమలను మనమే తయారు చేసుకోవాలి. అవి అందంగా ఉండాలంటే మనం ఇంట్లో ఉపయోగించే సహజసిద్ధమైన పసుపు, కుంకుమ వంటి వాటితో అలంకరించుకోవాలి. వాటినే పూజించాలి. పర్యావరణ పరిరక్షకులు కావాలి. దీనిపై విద్యార్థుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– తనికెళ్ల వీఆర్ఎస్‌కేఎస్ శాస్త్రి, ప్రకృతి పరిరక్షకుడు, అధ్యాపకుడు, కొత్తపేట

మట్టి విగ్రహాలే తయారు చేస్తున్నాం



గతంలో మా తయారీ కేంద్రంలో మట్టి విగ్రహాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కూడా తయారు చేసేవారం. ఉత్సవ కమిటీల కోరిక మేరకు భారీ విగ్రహాలు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసేవాళ్లం. అయితే పర్యావరణం పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఆ విగ్రహాలు విక్రయించడం లేదు. పైగా వ్యయ ప్రయాసలు తప్ప డబ్బు కూడా మిగలడం లేదు. కేవలం మట్టి విగ్రహాలే తయారు చేస్తున్నాం.

– మంతెన సుబ్రహ్మణ్యం, విగ్రహాల తయారీదారుడు, కొత్తపేట

క్లుప్తంగా

బీటీ రోడ్డుకు శంకుస్థాపన



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని బాడిలంకలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ అడబాల తాతకాపు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.కోటి వ్యయంతో 1.70 కిలోమీటర్ల మేర బ్లాక్ టాప్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇప్పటికే 600 మీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని సర్పంచ్ తెలిపారు. రూ.65 లక్షలతో బాడిలంకలో ఈ సీసీ రోడ్డు నిర్మించారన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు విళ్ల సుబ్బారావు, వార్డు సభ్యులు వానరాశి సూరిబాబు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ ద్వారా ఆర్థిక సాయం



చిరతపూడిలో రమేష్‌కు సాయం అందిస్తున్న ఎస్‌పీఎఫ్

అంబాజీపేట: చిరతపూడి శివారు చినపాలెంలో గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న పితాని రమేష్‌కు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూ.30 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. రమేష్ పరిస్థితిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి సుభాష్ రూ.20 వేలు, ఎస్‌పీఎఫ్ సభ్యులు సమకూర్చిన రూ.10 వేల నగదును సమకూర్చి రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో దొంగ శ్రీను, సంసాని బాలాజీ, చిట్టూరి శ్రీనివాస్, గుత్తుల రాము, మొల్లేటి శ్రీను, కాండ్రేగుల రాము, యనమదల మహేష్, విత్తనాల నాగకిషోర్ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని కొమరాజులంక గ్రామానికి చెందిన దొంగ సుబ్రహ్మణ్యం (48) నాలుగు నెలల క్రితం ఆటోలో ఉల్లిపాయలు అమ్ముకోవడానికి వెళుతుండగా మారేడుమిల్లి ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐరన్ రాడ్డు గుచ్చుకోవడం వలన కాలు ఇన్ఫెక్షన్‌కి దారి తీసింది. డాక్టర్లు ఆపరేషన్ చేసి సంవత్సరం వరకు రెస్ట్‌లో ఉండాలని ఆ తర్వాత కూడా కాలు పని చేస్తుందో లేదో చెప్పలేమని చెప్పారు. ఇతనికి ఇటీవల పక్షవాతం కూడా వచ్చింది. సుగర్ కూడా బాగా ఎక్కువగా ఉంది. వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. కొమరాజులంకలో సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేల చెక్కు సాయంగా అందజేశారు.

ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం



చింతలమోరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మలికిపురం: శంకరగుప్తం మేజర్ డ్రైన్ ముంపు సమస్య వల్ల కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం, సముద్ర తీర ప్రాంతాల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. చింతలమోరిలో ఎఫ్‌సీఐ మెంబర్ దొడ్డా నాగబాబు ఇంటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కేంద్రం వేల కోట్ల నిధులతో రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తుందని అన్నారు. అభివృద్ధికి ప్రజలు స్వాగతిస్తున్నారని రోడ్ల నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి, రైతుల ప్రయోజనాలు కొరకు పంటకు పెట్టుబడి నిధులు, పంట కాలువల పూడికల తొలగింపు అనేక మౌలిక సదుపాయాలు ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీవేమ, ఎఫ్‌సీఐ మెంబర్ దొడ్డా నాగబాబు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల బీజేపీ అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య, వాసు, వడ్లమూడి ప్రకాష్, కంచి నాగేశ్వరరావు, అడబాల వెంకన్నబాబు పాల్గొన్నారు.

వెన్నుపోటులో చంద్రబాబు సిద్ధహస్తుడు



మాచవరంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయంలోనైనా అధికార దాహం కోసం వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాచవరం, మొసలపల్లి గ్రామాల్లో పరిశీలకులు జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మట్టపర్తి బాలాజీల పర్యవేక్షణలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. కోఆర్డినేటర్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అమలు చేస్తామని, ఆదాయాన్ని సృష్టిస్తామని అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి, నేడు పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను నిలువునా మోసం చేశారన్నారు. సంపద సృష్టి పేరుతో గ్రామాల్లో వీధికి నాలుగు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులా పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ బాబు నయవంచన పాలనను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం చంద్రబాబుస్ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, డి.సత్యమోహన్, కుసుమ వరలక్ష్మి, కొర్లపాటి కోటబాబు, మట్టపర్తి హరి, మైల ఆనందరావు, కోట సత్తిబాబు, పులపర్తి గంగరాజు పాల్గొన్నారు.

మోసం–వంచన పథకాలకు బాబు అంబాసిడర్



తాటిపాకలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం

రాజోలు: సంక్షేమం–అభివృద్ధి పథకాలు రాష్ట్రంలో పూర్తిగా విస్మరించిన సీఎం చంద్రబాబు మోసం–వంచన పథకాలకు మాత్రమే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు. తాటిపాకలో గ్రామశాఖ అధ్యక్షుడు చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పతాకాన్ని మాజీ మంత్రి గొల్లపల్లి ఆవిష్కరించారు. గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును వివరించారు. గొల్లపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో అక్కచెల్లెమ్మలకు ఏదోఒక రూపంలో సంక్షేమ పథకాలు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారన్నారు. ప్రస్తుతం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. రాజోలు, మండలపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, మాజీ ఎంపీటీసీ మెడబల రాజ్‌కుమార్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు మద్దుల కాసు, రాజోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు, నాయకులు గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం

కొత్తపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల ఏర్పాట్లకు ఉత్సవ కమిటీలు శ్రీకారం చుట్టాయి. ఈ నెల 27 న వినాయకచవితి పర్వదినం పురస్కరించుకుని ఆ రోజు నుంచి గణపతి నవరాత్రులు నిర్వహిస్తారు. ఆ మేరకు గ్రామాల్లో వినాయక ఆలయాలతో పాటు పలు వీధుల్లో ప్రత్యేకంగా గణపతిని ప్రతిష్ఠించి నవరాత్రులు నిర్వహిస్తారు. మండలంలోని వానపల్లి గణేష్ సెంటర్ బాలగణపతి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పండితులు నిర్ణయించిన ముహూర్తాన స్థానికుడు బొడ్డు రంగయ్య దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట పాతారు. అలాగే పలు గ్రామాల్లో పందిరి రాట వేశారు.

లవ్ అండ్ హోప్ సేవలు అభినందనీయం



బిళ్లకుర్రులో కిరాణా సరకుల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరావు, నానిబాబు

కొత్తపేట: సమాజంలో పేద వితంతువులకు, అనాథ పిల్లలకు లవ్ అండ్ హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు అన్నారు. మండలంలోని బిళ్లకుర్రులో లవ్ అండ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితంతువులు, అనాథ పిల్లలకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ నెల్లి నానిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 20 మంది వితంతువులకు, పలువురు అనాథ చిన్నారులకు కిరాణ సరకుల కిట్లను లక్ష్మీపతిరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలు ముందుకు వచ్చి చేయూతనిస్తే భవిష్యత్తులో మరింత మందికి సేవలందిస్తానని నానిబాబు అన్నారు. సంస్థ సభ్యుడు కిరణ్ పాల్గొన్నారు.

కౌశికలో మొదలైన పూడిక, వ్యర్థాల తొలగింపు



కొత్తపేటలో కౌశికలో తీసిన వ్యర్థాలు, పూడికను జేసీబీతో తొలగించి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కొత్తపేట: స్థానిక కౌశిక డ్రైన్ అభివృద్ధి పేరుతో దానిలో తీసిన పూడికను ఎట్టకేలకు తొలగిస్తున్నారు. కౌశికలో పూడిక, చెత్త, తూటు, గుర్రపుడెక్క పేరుకుపోయి, మురుగు పారకపోవడంతో ఇటీవల ఆ వ్యర్థాలన్నీ జేసీబీతో తీసి గట్టుపైనే కాక రోడ్డు మార్జిన్లు, పలు చోట్ల రోడ్లపై వేసి అలాగే వదిలేశారు. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ నాలుకకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన మారిన కౌశిక డ్రైన్ అభివద్ధి తీరుపై **ఇదేమి అభివృద్ధండీ బాబూ..** శీర్షికన గత నెల 23న **సాక్షి**లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆరిపోయిన పూడికను, వ్యర్థాలను జేసీబీతో ఎత్తి ట్రాక్టర్‌పై వేసి తరలిస్తున్నారు. గట్టు ఉన్నచోట మట్టిని అక్కడే సర్దుతున్నారు. దాంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది తొలగింది.

తరచూ బాగు చేయాలి..

కొత్తపేటకి ప్రధానమైన కౌశిక డ్రైన్‌ను తరచూ బాగుచేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాని స్థానికులు పంచాయతీ, డ్రైన్ అధికారులను కోరారు. స్థానిక బొరుసువారి సావరం, శీలంవారిపాలెం, దేవరపల్లి శివారు ప్రాంతాల పంట భూముల్లోని మురుగుతో పాటు కొత్తపేటలో గృహాల వినియోగ మురుగునీరుకు ప్రధాన డ్రైన్ అయిన కౌశికలో పేరుకుపోతున్న పూడిక, తూటు, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టకపోవడం, గ్రామంలో కొందరు తమ ఇంటి చెత్తను, వ్యర్థాలను తీసుకువచ్చి కౌశికలో పారపోయడంతో మురుగు పారక దుర్గంధంతో పాటు దోమల ఉధృతి పెరిగిపోతుంది. ఆ దోమల దాడితో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. మురుగు ముందుకు పారితే దోమల ఉధృతి తగ్గుతుందని, ఎప్పటికో కాకుండా తరచూ కౌశికను బాగుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తాం



మెట్లకాలనీలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ భీమరాజు

అంబాజీపేట: వాహనాలకు ఎటువంటి రికార్డులు సక్రమంగా లేకపోయినా వాటిని ఆర్టీవో కార్యాలయానికి తరలించి సీజ్ చేస్తామని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో సీఐ భీమరాజు పర్యవేక్షణలో అంబాజీపేట మెట్లకాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ భీమరాజు మాట్లాడుతూ తనిఖీల్లో రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించాల్సి ఉందన్నారు. రికార్డులు సక్రమంగా ఉన్న వాహనాలను ఆయా యజమానులకు అందజేస్తామన్నారు. రికార్డులు లేని వాటిని బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల సారా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు ఇకపై ఆకస్మిక తనిఖీలు తరచూ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.చిరంజీవి, ట్రైనింగ్ ఎస్సై గుబ్బల సోమేంద్ర, ఏఎస్సైలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ల నియామకం

అంబాజీపేట: మండలంలోని ఆరు సొసైటీలకు గాను ఐదు సొసైటీలకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీ చైర్మన్లతో పాటు ఇద్దరు సభ్యులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. అంబాజీపేట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా అరిగెల సూర్యనారాయణమూర్తి (సూరిబాబు), చిరతపూడి సొసైటీకి రంపం సత్యనారాయణ, గంగలకుర్రు సొసైటీకి అల్లాడి సత్యనారాయణమూర్తి, ఇరుసుమండ సొసైటీ చైర్‌పర్సన్‌గా సుంకర గణపతిరావు, పుల్లేటికుర్రు సొసైటీకి దొమ్మేటి సురేష్ కుమార్ చైర్‌పర్సన్‌గాగా నియమితులయ్యారు. కాగా ముక్కామల సొసైటీకి త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ప్రకటించలేదు. ఇదిలా వుండగా త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్, సభ్యుల పదవీకాలం వచ్చే ఏడాది జనవరి 30, 2026 వరకు అమలులో ఉంటుంది.

పి.గన్నవరం: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఆరు సంఘాలకు గాను, ఐదు సంఘాలకు కమిటీలను నియమించింది. పి.గన్నవరం సహకార సంఘ చైర్‌పర్సన్‌గా సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, ఊడిమూడి సహకార సంఘ చైర్‌పర్సన్‌గా పెనుమర్తి వెంకటరత్నంనాయుడు, ఏనుగుపల్లి సంఘ చైర్‌పర్సన్‌గా బొరుసు సత్యనారాయణ, నరేంద్రపురం సంఘ చైర్‌పర్సన్‌గా తోలేటి నారాయణమూర్తి, ముంగండ సంఘ చైర్‌పర్సన్‌గా మట్టపర్తి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. నాగుల్లంక సహకార సంఘానికి త్రిసభ్య కమిటీని ప్రకటించాల్సి ఉంది.

రాజోలు నియోజకవర్గ పీఏసీఎస్ చైర్మన్‌లు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో చింతలమోరి సొసైటీకీ దొడ్డా సూర్యనాగప్రసాద్, గుడిమెళ్లంకకు గమిడి శ్రీనివాసరావు, కె.బట్టేలంకకు బోనం నాగేశ్వరరావు, తూర్పుపాలేనికి యెనుముల సూర్యనారాయణమూర్తి, కేశనపల్లికి ఆకుల సత్యనారాయణ, లక్కవరానికి గంటా వెంకట రామకృష్ణ నాయుడు, మలికిపురానికి జంపన వెంకట సత్యనారాయణరాజు, రామరాజులంకకు ఉంగరాల వెంకటబాలాజీ, ముత్యాలపాలేనికి నంద్యాల వెంకట తాతయ్య నాయుడు, బి.సావరానికి కాండ్రేగుల కుశలుడు, చింతలపల్లికి పిప్పళ్ల రాము, కడలికి కడలి శ్రీనేతికొండ, కాట్రేనిపాడుకు ఉలిశె శ్రీనివాసరావు, పొన్నమండకు అడబాల సూర్య వెంకట రామకృష్ణ, రాజోలుకు కసుకుర్తి త్రినాథస్వామి, తాటిపాకకు గుండాబత్తుల నారాయణస్వామి అంతర్వేదికి రావూరి నాగరాజు, అప్పనరామునిలంకకు రావూరి సూర్యనారాయణ, రామేశ్వరానికి చెల్లింగి లీలా మోహనశ్రీనివాస్, గుడిమూలకు రుద్రరాజు పద్మ రామలింగరాజు, మోరికి బల్ల వెంకటమహాలక్ష్మి, ఉయ్యూరి వారి మెరకకు వీరా వెంకట రామారావు, సఖినేటిపల్లికి గునిశెట్టి వెట్రిబాబులని చైర్‌పర్సన్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అయినవిల్లి: మండలంలో వీరవల్లిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు నియమితులయ్యారు.

ధర్మకర్తల మండలి నియామకానికి ప్రకటన జారీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ప్రకటన జారీ చేసినట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ ప్రభుత్వ జీవో ప్రకారం దేవదాయ శాఖ కమిషనర్ ఈనెల 8న జారీ చేసిన ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన జారీ అయిందన్నారు. కాగా ప్రకటన విడుదలైన తేదీ నుంచి 20 రోజులు వ్యవధిలో ఆసక్తి గల అభ్యర్థులు ఎండోమెంట్స్ ప్రొఫార్మా–2 ప్రకారం దరఖాస్తులను అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి పంపాలని సూచించారు.

విద్యారంగాన్ని కాపాడుకునేందుకు పోరాటం



మామిడికుదురులో యూటీఎఫ్ పతాకావిష్కరణ



కొర్లపాటివారిపాలెంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

మామిడికుదురు: విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు యూటీఎఫ్ పోరాటం సాగిస్తుందని జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు అన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ పతాకావిష్కరణ జరిగింది. సీనియర్ నాయకులు కుడుపూడి సత్యనారాయణ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు బోధనేతర పనులతో యాప్‌లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై యూటీఎఫ్ రాబోయే రోజుల్లో పోరాట కార్యక్రమం రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.పెద్దిరాజు, సీనియర్ నాయకులు ఆర్.నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, మొహిద్దీన్, కె.అరుణజ్యోతి పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ శాఖ మండల అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు కేతా గంగాధరం పతాకాన్ని ఎగురవేశారు. కార్యదర్శి పి.విశ్వప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ యూటీఎఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే సూత్రాలతో పనిచేస్తోందని వివరించారు. ఉపాధ్యాయులకు అనవసర ఒత్తిడి బోధనేతర పనులను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో దాకే చంద్రబాను, ముప్పి పుల్లయ్యశెట్టి, మట్టపర్తి రాంబాబు, బీర రామాంజనేయులు, పితాని శ్రీనివాస్, పరమటి ఏడుకొండలు, బెహరా మూర్తి పాల్గొన్నారు.

అయినవిల్లి: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 51వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ ఉపాధ్యాయులు పీవీ సూర్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించిన ఏకైక సంఘం యూటీఎఫ్ అని తెలిపారు. లక్ష సభ్యత్వాలు దాటి రాష్ట్రంలోనే అతిపెద్ద ఏకైక సంఘంగా నిలిచి చరిత్ర సృష్టించిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఫోన్ డైరీని ఆవిష్కరించారు. మండల శాఖ గౌరవ అధ్యక్షుడు జి.సాయి శ్రీనివాస్, అధ్యక్షుడు టీబీ ఈశ్వరరావు, సెక్రటరీ బి.సందీప్, జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు, సంక్షేమ పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

అంబాజీపేట: మండలంలోని నందంపూడి గ్రామంలో వేంచేసిన గ్రామదేవత ముత్యాలమ్మ జాతరను సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహించనున్నామన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచాలి



రాజోలు బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న డీపీటీఓ రాఘవకుమార్

రాజోలు: ప్రయాణికులకు సౌకర్యాలను మరింతగా మెరుగు పరచాలని అమలాపురం డీపీటీఓ రాఘవకుమార్ సూచించారు. ఆదివారం రాజోలు ఆర్టీసీ డిపో, బస్టాండ్ ఆవరణలను ఆయన పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ యజమానులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దాత సహకాంతో ప్రయాణికులకు ఏర్పాటు చేస్తున్న ఆర్వో వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు కూర్చునేందుకు చక్కటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ డీఎం పి.ధనమ్మ, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా సామూహిక వ్రతాలు

మామిడికుదురు: శ్రావణమాసం సందర్భంగా సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. పెదపట్నం బాబానగర్ కాలనీలోని శ్రీకోదండ రామాలయం వద్ద జరిగిన ఈ వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు కె.ధర్మారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. తమకు సౌభాగ్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగరాజు, సురేష్, ధర్మ ప్రసాద్ బైరిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.